# 31. జాతి గుండె చప్పుళ్ళివి

**నా** పాత అలవాటు ప్రకారం కుడిబుగ్గని కుడిఅరచేతితో మూసి, మా అత్తవారింటి వీధి వసారా మెట్లమీద కూర్చున్నాను. నన్ను ఓదార్చడానికి వచ్చిన వదినా, అన్నయ్యా తమతో హైదరాబాదు తీసుకెడదామని వ్యర్థ ప్రయత్నం చేసి మరీ వెళ్ళిపోయారు. మరి అదెంత గుండెదిటవో మా అత్తగారు ఇప్పుడిప్పుడే మళ్ళీ సంగీత పాఠాలు నేర్పడానికి వెళ్ళిపోయింది. వెళ్ళేముందు మరోసారి అదే బోధ చేసి వెళ్ళింది. "నా ఆత్మశాంతి గురించి ఎవరూ ఆలోచించకండి, అలాంటి భ్రాంతిని నేను ఒప్పుకోను!" అని మోహన్ చెప్పేవాడు కనుక, ఆ కర్మకాండ ప్రయత్నాలు నేనేం చెయ్యదల్చుకోలేదు. "ఇక వాడిని గుర్తుపెట్టుకునే ఒక మార్గం ఉన్నవాళ్ళు సుఖపడడం. ఈ పరిస్థితుల్లో నాకు తోచిన పద్ధతి చెప్పేను. కాదంటున్నావు నువ్వు. నిర్ణయం నీకే వదిలేశాం. నీకది నచ్చితేనే!" అని మరోమారు హెచ్చరించింది.

అరచేతికి కన్నీటి తడి తగిలింది. కన్నీటి గోళాలలో గతాన్ని చూడగలిగితే ఎన్నెన్ని వింత సంఘటనలు! పుట్టి పెరిగిన ఆ హైదరాబాదు ఎక్కడ, ఈ ఢిల్లీ ఎక్కడ! ఇలాగే బుగ్గమీద చెయ్యి ఆన్చుకుని ఆ రిపబ్లిక్ డే నాడు తను పాడడమేమిటి, ఇంటర్వ్యూ కోసం హైదరాబాదు వచ్చి ఆ ప్రోగ్రామ్‌కి ఎటెండ్ అయిన మోహన్, నా పాట మీద మనసుపడి నా జీవితం పంచుకోవడానికి సహా ఆరాటపడడమేమిటి!

చిన్న చిన్న ఆపరేషన్లు ఎన్ని చేయించుకున్నా నా బుగ్గమీది ఆ లేత గోధుమరంగు మచ్చ పూర్తిగా శరీరచాయలో కలిసిపోలేదు. ఆ కారణం చేత వచ్చిన సంబంధాలు వెనక్కి తిరిగి పోయినా నాకప్పటికి ఇంకా పాతికేళ్ళయినా నిండలేదు. నా పట్ల అన్నావదినలకి ఎంత శ్రద్ధ! త్యాగరాజు పేర్కొన్న 'ఎందరో మహానుభావులు' లిస్టులో చేర్చదగిన 'సౌజన్యమూర్ధన్యులు' వాళ్ళు. అప్పటికే బియ్యే మ్యూజిక్ అనిపించుకుని చిన్న ఉద్యోగం కూడా వెలిగిస్తున్నాను. ఓ మోస్తరుగా హాయిగానే వెళ్ళిపోయేవి రోజులు. కానీ హాయిలో కూడా ఇంత గొప్ప స్థాయి ఉంటుందని మోహన్‌ని కలుసుకుంటే గాని తెలియలేదు!

"సంగీతమంటే మా ఇంటిల్లిపాదికీ ఇక అన్నహారాలన్నవి అక్కర్లేదు. కానీ నీ పాట విన్న పరవశం నాకింతకు ముందు కలగలేదు. ఇలాంటి పాట వినే అదృష్టం నాకు ప్రతిపూటా కావాలి. నాతో నువ్వు రైలెక్కినా సరే, నన్నా మిలట్రీ నుంచి పారిపోయి నీ దగ్గరొచ్చి ఉండిపొమ్మన్నా సరే!"

"మరి ఈ మచ్చ మాట?" అని అడక్కుండా ఉండలేకపోయాను.

"మచ్చ అనేది మనసుకి లేకుండా చూసుకోవాలి. ఎక్కడో ఏదో ఓ చోట మచ్చలేని శరీరం అంటూ ఉంటుందా? బతుకంతా పచ్చదనం పంచగల ముచ్చటైన గొంతుక ఉండి కూడా, మచ్చ గురించి ఆలోచిస్తున్నావా, పిచ్చిదానా!"

భుజాల మీద రెండుచేతులూ వేసి కళ్ళల్లోకి చూస్తూ మోహన్ ఆ రోజు ఆడిన మాటలు ఎలా మర్చిపోగలను? ఇప్పుడూ, ఎప్పుడూ కళ్ళముందు కదలాడుతూనే ఉంటుంది ఆ స్వరూపం, స్వరం!

ఆ శరీరం ఓ శిఖరాగ్రం. ఆ భాషణం మధురామృతం. మరి ఆ మానసం? దాన్ని వివరించడం నా తరమేనా! అన్నిటినీ మించి దొర్లిదొర్లి ఏడుస్తున్నవాళ్ళనైనా పొర్లిపొర్లి నవ్వించే పూతరేకుల్లాంటి ఆ జోకులు!

"మా అమ్మా, నాన్నా చిన్నప్పుడే పోయారట!"

అని నేనంటే, "మరో మంచి చోటు చూసుకొని కాస్త ముందూ వెనుకగా దాటేసి ఉంటారు అదృష్టవంతులు. మరి మా నాన్న అలా కాదే!"

"అంటే?"

"మరేం లేదు, నన్నూ, తమ్ముణ్ణీ మా అమ్మకప్పజెప్పి 'అందాకా వీళ్ళతో ఆడుకుంటూ ఉండూ' అన్నట్టు మా నాన్న చిన్నప్పుడే లేచిపోయాట్ట!"

"అయ్యో! అదెవరితో?"

"ఇంకెవరితో.... మృత్యుదేవతతో!" అంటూ నవ్వొకటి!

"ఇలాంటివి చెబుతున్నప్పుడు మీకు నవ్వెలా వస్తోందీ?"

"మనిషికి ఏ చెయ్యో, కాలో విరిగి మంచాన పడితే కుంచెడు నీళ్ళకి ఏడవాలి గాని, ఏకంగా నిమిషాల మీద శరీరమే లేచిపోతే బాధపడడం దేనికి? చావు అనేది ఏ జీవికైనా జన్మహక్కు కదా!"

"బాగుంది జెమాజెట్టీల్లా ఉన్నారు గనుక మీరూ, మీ తమ్ముడూ ఇలా ఎన్ని కబుర్లయినా చెబుతారు. మిమ్మల్నిద్దర్నీ అలా చూస్తుంటే క్లోజ్‌ఫ్రెండ్స్ అనిపిస్తుంది గానీ ఎవరూ అన్నదమ్ము లనుకోరు. మీ నోట్లో వెలుగుతున్న సిగరెట్టు నుంచే మీ తమ్ముడూ సిగరెట్టు అంటించుకోవడం చెప్పకేం, మాకు కొంత ఆశ్చర్యంగానే ఉంది!"

"అలా ఉండడమే మాకిష్టం. లేనిపోని మర్యాదలూ, గౌరవాలూ మాకు ఇష్టం ఉండదు. ఏదైనా ఫ్రీగా డిస్కస్ చేసుకునే ఫ్రెండ్స్‌లాగే ఉంటాం. పాత తెలుగు సినిమా పాటలంటే ఇష్టమనీ, ఇక్కడ 'జయభేరి' ఆడుతోందనీ వంకపెట్టి వచ్చాడు గాని మా మధూకి నన్నంటిపెట్టుకొని ఉండడమే ఇష్టం. మళ్ళీ ఈ పుణ్యకాలం కాస్తా అయిపోతే నాతో స్పెండ్ చెయ్యడం కుదరదు కదా... ఈ డిటెయిల్స్ అన్నీ కొత్తదానివనే సందేహమైనా లేకుండా నీతో ఎందుకు చెబుతున్నాను చెప్మా! ఆ... తెలిసింది. నువ్వు కొత్తదానివని ఎప్పుడైనా అనిపిస్తే కదా!"

ఆ కబుర్ల కమ్మదనానికి ఒళ్ళు పులకరించి తల దించుకున్నాను. అతను తల పట్టుకు పైకెత్తి "దాస్తే మాత్రం ఆ కళ్ళల్లో భావం దాగుతుందా! మనసారా ఇష్టపడుతున్నావని వేరే చెప్పాలా?

మీ వాళ్ళు కాదనరు గనక ఇక అమ్మే రావాలి. అప్పుడే టెలిగ్రాం ఇచ్చాను కూడా. ఆవిడసలే మ్యూజిక్ టీచర్. కోడలుగా ఏ కీచురాయి దిగబడుతుందో అని పీచుపీచుమంటోంది ఆమె గుండె. ఇక ఈ మాధుర్యం రుచి చూసిందంటే నన్నసలు పట్టించుకుంటుందా అని..."

వదిన అనబోయింది :

"అన్నీ బాగానే ఉన్నాయి గానీ, మా పిల్ల చూస్తే మరీ మల్లెమొగ్గ తంతు. మీరేమో చెరుకుగడ బాపతు....!"

"ఏమో బాబూ, పెళ్ళికూతుళ్ళని పేరుపెట్టి మా అమ్మ ఇప్పటికే చూపించే 'టూ ఇన్ వన్ శాల్తీల్ని' ఎదుర్కోలేక చస్తున్నాను. ఇలాంటి హాఫ్ టిక్కెట్టే నా ప్రాణానికి బెటరైన బెటర్‌హాఫ్!"

నేనూ, మా అన్నయ్యా, వదినా, అతనూ, వాళ్ళ తమ్ముడూ అందరం ఓ ఐదారేళ్ళు అటూ ఇటూగా ఓ వయసువాళ్ళం. మేమంతా ఒకటవడంలో ఆశ్చర్యం లేదు గానీ, వాళ్లమ్మగారు?

"మంచి తలపు రావడం కన్న మంచి ముహూర్తమేముందీ లోకంలో?" అనుకుంటూ ఆ మూడోనాడే పాతబస్తీలోని రామాలయంలో మమ్మల్నో ఇంటివాళ్ళని చేస్తుందా! ఏం స్పీడు బాబూ వీళ్ళది!

ఇక అతని తమ్ముడు మధూ? ఏదో ప్రైవేటు కంపెనీలో ఎకౌంటెంట్‌గా చేస్తున్నాడట కదా... అంతా అయిదువేలు కూడబెట్టాడుట.

"వదినా! మీరిద్దరూ కాశ్మీరు వెళ్ళి డాల్‌లేక్‌లో విహరించి రావాలి. మీ హనీమూన్ ఖర్చులకి ఇదిగో నా ప్రెజెంట్ అయిదువేలు! నౌకా విహారంలో 'లాహిరి లాహిరి లాహిరిలో' పాడుకోవాలి సుమా!"

మధూకి బాగా పాటలు రాయడం వచ్చు. అన్నగారు నోరు విప్పితే అక్కడ నిలబడలేం గాని, తమ్ముడు ఓ మోస్తరుగా పాడతాడు కూడా. అందుకే అన్నదమ్ములిద్దరికీ అంతటి సాన్నిహిత్యం.

వాళ్ళమ్మగారైతే వాళ్ళు విజయవాడలో ఉన్నప్పుడు ఆరేళ్లపాటు శాస్త్రీయ సంగీత సాధన చేసిందట. ఎక్కడో ఢిల్లీలో మారుమూల సామాన్యమైన బతుకులు వెళ్ళదీస్తూ అన్నివేల తెలుగు క్యాసెట్లు సంపాదించడం ఆశ్చర్యకరం.

ఇంతకీ ఎవరైనా బాగా పాటలు రాయొచ్చు. లేదా బాగా పాడొచ్చు. ఈ రెండు పనులూ ఇంకా అంత గొప్పగా చెయ్యగల కళాకారులు కూడా అరుదుగా ఉండొచ్చు. కానీ ఆడుతూ, పాడుతూ, బతికున్న ప్రతిక్షణం ఇంతగా సార్ధకం చేసుకోవడం మాత్రం వీళ్ళకే చెల్లిందేమో!

'నా జీవన దృక్పథం అంతా ఓ పాటలో మలిచాడు కాబట్టే తమ్ముడంటే నాకంత ఇష్టం' అనేవాడు మోహన్. అందుకే అన్ని పాటల్లోనూ దానిదే అతని దృష్టిలో ఆధిపత్యం. ఆ కారణం చేత పదేపదే పాడించుకునే ఆ పాటే అతనికి ఆణిముత్యం. ఇందులో ప్రతి ముక్కా నాలో నాటుకుపోయింది. అది ఇలా ఉంటుంది.

**"గతం గతంలో ఖతమే కానీ**

**భవిష్యత్తు ఒక ప్రశ్నే అవనీ**

**ఈ క్షణమైనా ఇక నాదేగా**

**ఇదే చాలదా, చేవ చూపగా!"**

అతను పనిచేస్తున్న మిలట్రీలో కవాతు చేస్తున్నప్పుడు బ్యాండ్ వాయిస్తారుట. దానికి తగ్గట్టు తను ట్యూన్ చేసుకొని తమ్ముడి చేత యిలా మోహన్ ఈ పాట రాయించుకున్నాట్ట.

**"చరచర అడుగేయ్!**

**చిచ్చెర పిడుగై!"**

"పాకిస్తాను వాళ్ళు దొంగదెబ్బ తీస్తున్నారనే వార్తలు వింటున్నాం. ఇతనేమో ఇన్‌ఫెంట్రీలోనే చేస్తున్నాడాయె. బొత్తిగా చావుబతుకుల రణరంగం. అతన్ని ఎంచుకోవడంలో మరోమారు ఆలోచించడం మంచిదేమో!" అని అన్నయ్య మొదట్లో హెచ్చరించాడు కూడా.

కానీ ఓసారి మనసు విప్పి అర్థం చేసుకున్నాక అంతటి ఉన్నతమైన వ్యక్తిని ఎలా కాదనను!

నిజానికి చెరగని ఆ చిరునవ్వు చూసి మనమే తెలుసుకోవాలి గానీ, ఆ వ్యక్తిత్వాన్ని ఎలా నిర్వచించగలం!

ఆర్నెల్లు సావాసం చేస్తే వారు వీరవుతారో లేదో తెలీదు గానీ, ఈ కొద్దినెలల్లో వీరికి అంతుబట్టిన వారి జీవన రహస్యం మాత్రం ఇదీ!

మనిషిగా బతకాలంటే జీవితాన్ని ప్రేమించాలి.

జీవితం అంటే?

"అది గతమూ కాదు, భవిష్యత్తూ కాదు. గతం మరి రానిది. భవిష్యత్తు అంతుచిక్కనిది. నీ చేతిలో ఉన్నది నిన్నా కాదు, రేపూ కాదు ఇవాళే, ఇప్పుడే, ఈ క్షణమే! నువ్వేమైనా చేసేదీ, నీ సత్తా చూపించేదీ నేడే, ఈనాడే! చుక్కా చుక్కా రసాన్ని పీల్చినట్టు క్షణం క్షణం జీవితసారాన్ని గ్రోలగలగాలి. అదే జీవితమంటే! ముక్కూ మొహం ఎరగని ఏ పటంలోని ప్రభువుకో, ఏ కొండ మీది శిలావిగ్రహానికో, ఏ చిల్లర దేవుడికో నీ సమస్తం మీదుకట్టి ప్రసాదాలు తెగ మెక్కి భజనలు చెయ్యడం కాదు. నీ చుట్టూ ఉన్న మనుషుల మనసుల వెలుగునీడల్ని సాటిమనిషిగా సానుభూతితో అర్థం చేసుకొని స్పందించగల మనోధైర్యం. ఇలా చెయ్యగలిగితేనే ప్రవహించే నదిలో వెన్నెల పడినట్టు నీ మనసెప్పుడూ పరవశంలో పరవళ్ళు తొక్కుతూ ఉంటుంది. అప్పుడే నీ మొహమెప్పుడూ చిరునవ్వుతో వెలిగిపోతూ ఉంటుంది. పేరుకి కొన్ని నెలలు కావచ్చు కానీ, మోహన్ తత్త్వం నాకు బోధపడింది ఇంతవరకే." అయినా ఇలా మేం కాశ్మీరు నుంచి రిటర్న్ అయ్యామో, లేదో ఆ మర్నాడే అతనికి హైకమాండ్ నుంచి నిలుచున్న పళాన రమ్మని ఆర్డర్స్ రానే వచ్చాయి.

మోహన్ నమ్మకపోవచ్చు గానీ, ఏ దుర్ముహూర్తాన నేనత్తారింట్లో కాలుపెట్టానో, ఇంచుమించు అప్పుడే అనుకుంటా పాకిస్తాన్ చొరబాటుదారులు మన వాస్తవాధీనరేఖను దొంగచాటుగా అతిక్రమించి మన సైన్యాన్ని నిర్ఘాంతపరిచారు. కాశ్మీర్ సమస్యని ఎలాగైనా అంతర్జాతీయం చెయ్యాలనే వాళ్ళ పన్నుగడకి ఇది మరో ఎత్తు కాబోలు.

ఆ మధ్య ఇక్కడ దొరికే హిందీపేపరులో ఓ వార్త వచ్చింది. అది ఇంచుమించు ఇలా ఉంటుందని దాన్ని ట్రాన్స్‌లేట్ చేసిన మధూ చెప్పాడు. అలాంటి విషాద ఉదంతాలు ఎన్నెన్నో...

ఆ మేజర్ శత్రువుల బంకర్‌పై దాడిచేసిన మూడు సైనిక బృందాలలో కేంద్రబృందానికి నాయకుడట. పదహారువేల అడుగుల ఎత్తైన శిఖరాన్ని ఆ కటిక చీకటిలో హిమాలయాలలో అధిరోహిస్తుండగా పెళ్ళాం రాసిన లేఖ అందిందట. పెళ్ళయి కొన్నినెలలే అయిందట మరి. ఓ చేతిలో మ్యాపు, మరో చేతిలో ఏకే 47 రైఫిలూ. పెళ్ళాం ఏం రాసిందో? వాళ్ళ నాన్నగారికి హార్ట్ ఆపరేషన్ అయి కులాసాగా ఉన్నారో లేదో తెలుసుకుందామని కొట్టుకుంటోందిట మనస్సు. కానీ అతని ముందున్న లక్ష్యం కీలకమైన టోల్‌లింగ్ శిఖరాన్ని ఆక్రమించి కూర్చున్న శత్రువుని తరిమి కొట్టడం. "అదయ్యాక తీరిగ్గా ఇంటికొచ్చి ఆవిడ ఉత్తరం చదువుకుందాంలే!" అనుకున్నాట్ట. ఎలాగైతేనేం శత్రుబంకర్ మనవాళ్ళ వశమైంది కానీ ఆ మేజర్? శత్రువుల బుల్లెట్లకి భయపడకుండా పురోగమించి చివరి వరకూ పోరాడుతూనే నేలకొరిగాడు. జేబులో ఉత్తరం మడత విప్పకుండానే ఉండిపోయింది. నైనితాల్‌లోని అతని కుటుంబానికి ఆ శవపేటిక చివరిచూపుగా దక్కింది.

చేరిన ఉత్తరమే చదువుకోడానికి అవకాశం లేని సైనికుడి బతుకులో తనకు తానుగా ఇంటికి వార్తలు చేరేసే వీలంటూ ఉంటుందా? కానీ మోహన్ జీవితంలో అసాధ్యమనేది లేనే లేదు. 'మనసంటూ ఉండాలే గానీ మార్గమే ఉండదా!' అనే సామెతను అక్షరాలా రుజువు చేసిన సాహసి అతను. ఇదిగో, మీ ముగ్గురికీ, అంటూ మొదలెట్టి ఏవేవో తమాషా భోగట్టాలు. తన ఆరోగ్యం గురించి గానీ, తను ఎదుర్కొనే ఇబ్బందుల గురించి గానీ ఒక్క ముక్క అందులో ఉండదే! ఏ ఇరవై ముప్పై రోజులో మేం ఎదురు చూస్తే ఏం గాక..... రెండే రెండు ముక్కలుంటే ఏమైందని .... ఓ జీవితకాలంపాటు మళ్లీ మళ్లీ చదువుకోవచ్చు.

"ఈ కార్గిల్‌లో ఈ చలినీ ఈ ఎగుడు దిగుడు నేలనీ తట్టుకుని ఆహారమూ, మందులూ, ఆయుధసామగ్రీ చేరవేయడానికి ప్రకృతి ప్రసాదించిన ఏకైక సాధనాలు ఏమిటో తెలుసా? కంచర గాడిదలు మించిన సూడిదలు ఇంకేమున్నాయ్!"

"చెమట బిందువుల గొప్పదనం గురించి మన శ్రామిక నాయకులు ఎన్నెన్నో గ్రంథాలు రాశారు. ఇంత ఎత్తున ఈ చలిలో మాటవరసకైనా చెమట కనిపించదు. కష్టజీవుల కృషిని దేన్నిబట్టి గుర్తించాలో శ్రీశ్రీ గారిని అడగవలసిందే!"

"రెండో పూట స్నానం చెయ్యకపోతే చచ్చేవాళ్లం ఆ ఢిల్లీలో. ఇక్కడ వారానికొకసారే ఆ పని

చెయ్యగలగడం అదీ గగనమే!"

"ఏదో రాస్తున్నాను గానీ, మీతో తెగతెంపులు చేసుకుని చాలా రోజులైనట్టుంది నాకు. ఈ చుట్టుపట్లవాళ్లే అత్యంత సన్నిహితులు అనిపిస్తున్నారు. మా లక్ష్యమూ మార్గమూ ఒకటే మరి! చరచర అడుగెయ్, చిచ్చర పిడుగై!"

అంతే, మరి భోగట్టా లేదు. మేం రాద్దామంటే, మధూ ఎన్ని ప్రయత్నాలు చేసినా మోహన్ ఆచూకీ తెలిస్తే కదా!

మా అత్తగారిది హృదయమో, రాతి ఫలకమో నాకు తెలీలేదు. నోరు విప్పి మాట్లాడటం అటుంచి, ఆ కళ్లనుంచి కూడా ఎలాంటి భావమూ తొణికేది కాదు. అలా ఏ రోజూ మానకుండా సంగీత పాఠాలు నేర్పించి వస్తూనే ఉంది.

ఎప్పుడైనా ఆవిడ ఏ అన్నమాచార్య కీర్తనో ఎత్తుకుంటే నేనూ గొంతుక కలుపుతాను. ఆ వేళకి ఇంట్లో ఉంటే మధూ కూడా గళం కలుపుతాడు. ఎప్పుడైనా అలా లభించే ఆ తృప్తి మాటలకందనిది.

అప్పుడప్పుడూ అనిపించేది, ఉన్నదాన్ని, ఆ హైదరాబాదులో పడి ఉండక ఇక్కడికొచ్చి బావుకున్నదేమిటని..... తాత్కాలికమైన ఆ చవట ఆలోచనకి మేలుకున్న నా మనసు చచ్చే చీవాట్లు పెట్టేది. ఎవడ్నో పెళ్లాడి, ఎందర్నో పిల్లలని కని, ఎక్కడో కన్ను మూయడానికేనా ఈ బతుకు? అంతకంటె ఇది ఉన్నతమైంది కాదా? కొద్ది రోజులే అయితేనేం. ఈ మోహన్ దగ్గర నేర్చుకున్నది, బతుకంతా దాచుకోవలసింది కాదా!

కేవలం ఇంటి చాకీరితో రోజు గడిపెయ్యడం బొత్తిగా ఈ రొటీన్ పని నన్ను పిచ్చిదాన్ని చేస్తుందేమో అనిపించింది. ఎక్కడో మా ఇంటికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న ఓ సైడు హీరోయిన్‌కి ఇంగ్లీషు వచ్చినదానికి తెలుగు చెప్పాలట. మధూ ప్రకటన తెచ్చినా నా ముందు పడేశాడు. వెంటనే ఫోన్ చేసి కనుక్కున్నాను. రానూ పోనూ కారు పంపిస్తారుట. మొత్తంగా రెండు వేలు ఇస్తారట. ... 'ఈ రోజే నీది' అనలేదా మోహన్? మధూ చేత ఆ పాట పాడించుకున్నాను. ఆవేళే ఆ ఉద్యోగంలో చేరాను.

శరీరం అలసటకి లోనైంది గనక మునపటికంటె రోజులు తొందరగానే ముందుకు వెడుతున్నట్టనిపించింది. కానీ ఏ క్షణమూ నన్ను మోహన్ ఆలోచన వదల్లేదు. రాత్రిపూట తెలివి వస్తే మరీను. ఇతనికేమైనట్టు?

ఎంత పాత ఢిల్లీ మారుమూల ప్రదేశమైనా మేమున్నది రాజధాని కదా! ఎక్కడ చూసినా యుద్ధవార్తలే. ఏ పత్రిక తిరగెయ్యి, ఏ టీవీ చూడనియ్యి, శత్రుభూమి నుంచి ప్రత్యక్ష కథనాలే.... జాతికి చిరస్మరణీయులైన కార్గిల్ అమరవీరుల కథలే..... వీరజవానుల విజయవిహారానికి నివాళులు పడుతూ విరాళాలు అందజేస్తున్న వివరాలే......

కార్గిల్ నిధికి చందాలందించే ప్రతి ఒక్కరిలో ప్రస్ఫుటమయ్యే దేశభక్తి చెప్పేది ఒకటే 'మీతోపాటు మేమూ' అని మనసంటూ ఉండాలి గానీ ఇవ్వడానికి బీదతనం అనేది అడ్డురాదని ఎన్నిసార్లు

ఎందరెందరు దేశమంతటా రుజువు చేశారో! ఓ గుడిముందు యాచకులు పోగు చేసి ఇచ్చిన చిల్లర మూటకట్టడానికి ఓ పెద్ద జాతీయపతాక వస్త్రం చాలలేదట! భారతీయ రెడ్‌క్రాస్ సొసైటీ రక్తనిధికి దాతల రక్తం అవసరానికి మించి వచ్చి పడడంతో దాచడం అనేది సమస్యై కూచుందిట. ఓ వృద్ధురాళ్ల శరణాలయంలో సుమారు నూరుమంది ఓ రోజు ఉపవాసముండి ఆ వచ్చిన రెండువేలూ కార్గిల్ నిధికి అందించారట. కాలూ, చెయ్యీ యుద్ధంలోనే కోల్పోయి ఇల్లు చేరి చక్రాల కుర్చీకి అంకితమైన ఓ వీరుడు 'నా దగ్గర ఇవ్వడానికి ఏం లేవంటే ఒప్పుకోను. ఓ కన్నూ, ఓ మూత్రపిండమూ ఇవ్వగలను కదా!' అని సిద్ధపడుతున్నాట్ట.

ఇవన్నీ చదువుతూ ఉంటే నేనూ ఏదైనా చెయ్యాలి. అనే ఆవేశంతో గుండె కొట్టుకునేది. పిడికిలి బిగుసుకునేది. ఇంకా ఆలశ్యమెందుకు? ఇప్పుడే మొదలెట్టు..... ఈ రోజే..... ఈ క్షణమే అనే మోహన్ సందేశం ముందుకు తోస్తున్నట్టుండేది సరే. ఆ రోజుల్లోనే ఆ గుండె పగిలే కబురు అందనే అందింది. సహచరుల మృతదేహాల కోసం వెళ్లే సాహసకృత్యంలో శత్రువుల తూటాలు తొడలోంచి దూసుకుపోగా మోహన్‌ని ఆస్పత్రిలో చేర్చారట. అంత బాధలోనూ పళ్లు బిగపట్టి ఓ నవ్వులాంటిది రానిచ్చి "నాకు చేతనయింది చేశాననే తృప్తితోనే పోతున్నాను. పరవాలేదు ఇంకా ఏమైనా మిగిలుంటే మా వాళ్లున్నారులెండి!" అంటూనే కన్ను మూశారట.

తెలిసినవాళ్ళతో తెలియనివాళ్లతో ఆ తర్వాతి రోజులన్నీ మా ఇల్లంతా కిక్కిరిసిపోయింది పరామర్శలతో. ఇక ఆ సానుభూతికి అంతులేదు. ఆ తీర్థ ప్రజకి దరీ లేదు. అన్నా, వదినా కబురు ఆలస్యంగా తెలిసినా వెంటనే వచ్చేశారు. రమ్మని ఎంత బతిమాలినా, ఎప్పుడూ నోరు విప్పని అత్తమ్మతో సహా వాళ్లతో శ్రుతి కలిపినా, నా స్థానం అక్కడే అక్కడే అని ఎప్పుడో నిర్ణయించేసుకుంది నా మనసు. కార్గిల్ యుద్ధంలోని ఆ అసాధారణ ధైర్యసాహసాలూ, ఆపద అని స్పష్టంగా తెలిసినా అందులోకి ఉరికి శత్రువుని చిత్తు చెయ్యాలనే మనవాళ్ల అకుంఠిత ఆత్మవిశ్వాసమూ నా నరనరమూ ఏదో ఒకటి దీనికోసం చేసితీరాలనే ప్రబోధ గీతం ఆలపిస్తున్నాయి. జాతీయ ప్రభుత్వం అప్పుడే రెండు లక్షల రొక్కమూ, ఫామిలీ పెన్షనూ ఖరారు చేస్తూ కాగితాలు పంపింది. ఇవన్నీ అనుభవిస్తూ కూర్చోవడానికేనా ఇక్కడికి వచ్చింది! గతాన్ని తలుచుకుని బాధపడుతూ, భవిష్యత్తు కోసం ఏదో ఏర్పాటు చేసుకుంటూ, చచ్చేదాకా బతకడమేనా జీవితం అంటే? అనే నా ప్రశ్నకి అత్తమ్మే జవాబు చెప్పింది. "నాకింకో కొడుకున్నాడు వాణ్ణి పెళ్లాడు......" కోపంతో బుసలు కొట్టాను ఆ సూచనకి సిగ్గుతో ముడుచుకు పోయాను. అవమానంతో దహించుకుపోయాను. రోజుల తరబడి గిలగిల కొట్టుకుపోయాను. తర్వాత స్థిమితంగా ఆలోచించాను. అదే ఇష్టం లేకపోతే ఆ రోజే హైదరాబాదు రైలు ఎందుకెక్కేశాను కాను!

"చూడూ, మరోసారి ఆలోచించు మా మధూ నీకన్న ఒకే ఒక ఏడాది పెద్ద. వాడికి నువ్వు తల్లి వరుస ఎలా అవుతావు? ఎంత వదినవైనా? వచ్చిందగ్గర్నుంచీ నన్ను తల్లిలా చూసుకుంటున్నా వెందుచేత? ఏ వరస అయినా మనం అనుకోడంలోనే ఉంది. వాడితో కూడా ఓసారి మాట్లాడి చూడు!"

అంది. మధూ తల వంచుకుని 'తనకిష్టమే' అని చెప్పి అక్కణ్ణుంచి వెళ్లిపోయాడు. వీళ్లు నా కిష్టమే గానీ ఈ కొత్త సంబంధానికి సిద్ధపడలేకపోతున్నాను.

ఆ రోజా......

కంటోన్మెంట్‌లో ఉన్న సైనిక ఉద్యోగాల భర్తీ కేంద్రానికి వెళ్లొచ్చాడట మధూ. అంతేకాదు. కఠినాతి కఠినమైన ప్రాథమిక పరీక్షలో కూడా నెగ్గాడట! బహుశా సెలక్ట్ కావొచ్చని తల్లితో చెబుతూంటే విన్నాను. "నా కడుపులో మళ్లీ చిచ్చు పెట్టకు నాయనా!" అంటుందేమో అనుకున్నాను అత్తమ్మ. ఊహూ మెరిసే కళ్లతో ఆశీర్వదించింది! ఆ క్షణమే నా మనసు ఓ నిర్ణయానికి వచ్చేసింది. దేశానికి వీరపుత్రుణ్ణి ఇవ్వాలంటే నేనూ అత్తమ్మ మాట వినవలసిందే!

★